ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సూర్యాపేట

5

ఆదివారం 18 ఆగస్టు 2024

** గరిష్ఠం 34.0 కనిష్ఠం 23.4



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	590 (312.5050)	68,984	69,884
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.38 (3.78)	768.05	564.83
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.34 (44.74)	58,450	57,698

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.170 | స్కిన్‌లెస్ : రూ.190



నాగార్జున సాగర్ ఆయకట్టు వరి సాగుకు ప్రసిద్ధి. గతంలో సంప్రదాయ వరి పంటలకు నెలవైన ఆయకట్టులో నేడు సన్న రకాల పేరుతో ప్రైవేట్ విత్తనాల సంస్థలు పాగా వేశాయి. వ్యాపారులకు లాభసాటిగా మారిన ఈ రకాల సాగు రైతులకు మాత్రం నష్టాన్ని కలిగించి కన్నీళ్లు పెట్టిస్తున్నాయి.

- మిర్యాలగూడ(వ్యవసాయం)

ప్రైవేట్ వరి విత్తనాల పాగా

- ఆయకట్టులో 90 శాతం అవే సాగు
- తెగుళ్లతో నష్టపోతున్న రైతులు
- మిల్లర్ల ఆసక్తితో తప్పని సాగు

నాగార్జునసాగర్ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 6.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ప్రాంతంలో దశాబ్దాలకాలంగా ప్రైవేట్ వరి విత్తనాల సాగు గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 90శాతం మేర వివిధ రకాల ప్రైవేట్ రకాలైన చింట్లు, హెచ్ఎంటీ వంటి విత్తనాలు సాగవుతున్నాయి. కేవలం 10శాతం మాత్రమే సంప్రదాయ వరి రకాలు సాగువుతున్నాయి.

సంప్రదాయ వరి విత్తనాలకు స్వస్తి

రాష్ట్రంలో 1980లో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ పరిశోధనా సంస్థ నుంచి విడుదలైన బీపీటీ-5204 (సాంబమసూరి) వరి రకం దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఈ రకం వరి తెగుళ్లను సమర్థంగా తట్టుకోవడంతో పాటు ఎకరానికి 40-50 బస్తాల వరకు దిగుబడి వచ్చేది. రైతులకు ఈ రకం సాగు లాభసాటిగా ఉండేది. సన్నగా ఉండటంతో పాటు రుచిగా ఉండేది. మార్కెట్లో మంచి గిరాకీ కూడా పలికేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు ఒడిషా తదితర రాష్ట్రాల్లో ఈ పంట లక్షల ఎకరాల్లో సాగైంది. నాలుగు దశాబ్దాల పాటు ఈ రకానికి వానాకాలం సాగులో తిరుగులేకుండా పోయింది. కాలక్రమేణా వినియోగదారుల అభిరుచుల్లో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. చాలా సన్నగా ఉండే రకాలకు మార్కెట్లో డిమాండ్ పెరగడంతో బీపీటీ సాగును రైతులు తగ్గించి ప్రైవేట్ విత్తనాల వైపు మొగ్గుచూపుతున్నారు.

అనివార్యంగా ప్రైవేట్ రకాల సాగు

సాగర్ ఆయకట్టులో అత్యధికంగా పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయి. ధాన్యం కొనుగోలులో మిల్లర్లదే కీలక పాత్ర. మర్కెట్లో వారు చెప్పిందే వేదం. ప్రైవేట్ వరి వంగడాలు సన్నగా ఉండటంతో ఈ రకాలకు మార్కెట్లో ధర పలుకుతుండటంతో మిల్లర్ల ఈ రకాలను కొనుగోలు చేస్తున్నారు. బీపీటీ వరి రకాలు సాగు చేసినా మిల్లర్లు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. నాలుగేళ్లుగా ప్రైవేట్ రకం ధాన్యాన్ని క్వింటాకు రూ.2,200 చెల్లించిన మిల్లర్లు బీపీటీ ధాన్యానికి కనీసం రూ.1,700 కూడా చెల్లించడం లేదు. చాలా మంది మిల్లర్లు అసలు ఈ రకాలను కొనుగోలు చేయడం లేదు. యాసంగిలో అత్యధికంగా సాగయ్యే ఎంటీయు-1010 వంటి రకాల ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థలు మినహా మిల్లర్లు కొనుగోలు చేయడం లేదు. ఈ రకం ధాన్యాన్ని 17 శాతం తేమ వచ్చేవరకు ఆరబెట్టాల్సి రావడంతో గత్యంతరం లేని పరిస్థితిలో అధిక ఉష్ణోగ్రతలు తట్టుకోలేని ప్రైవేట్ రకాలను సాగు చేయాల్సి వస్తోందని, దిగుబడులు అంతగా రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ పరిశోధనా కేంద్రాలున్నా

రాష్ట్రంలో ప్రభుత్వరంగ వ్యవసాయ పరిశోధనా సంస్థలు ఉన్నా, ప్రైవేట్‌కు దీటుగా మార్కెట్లో డిమాండ్ ఉన్న అతి సన్న రకం వంగడాలను రూపొందించలేకపోతున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం పరిశోధనా సంస్థ ఆర్ఎన్ఆర్-15048, కేఎన్ఎం, జేజీఎల్, కేపీఎస్ వంటి వందల రకాల విత్తనాలు రూపొందించింది. ఈ విత్తనాలు చాలా వరకు తెగుళ్లను తట్టుకుంటాయి. ఎకరానికి 40బస్తాలకు పైగా దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. వీటి సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయినా మార్కెట్లో ఈ రకం విత్తనాలు ప్రభావం చూపలేకపోయాయి. గింజ పరిమాణంలో తేడా ఉండటంతో పాటు ప్రైవేట్ రకాల మాదిరిగా పచ్చి ధాన్యం విక్రయానికి అనువుగా లేకపోవడంతో మిల్లర్ల నుంచి ఆదరణ లభించడం లేదు. నాణ్యమైన విత్తనాలు రూపొందించినా, మార్కెట్‌ను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయడం లేదనే విమర్శలూ ఉన్నాయి. వ్యాపారులతో చర్చించి ప్రభుత్వరంగ సంస్థలు రూపొంచిన వంగడాలను కొనుగోలు చేసేలా ఒప్పందం చేసుకుంటే తప్ప ప్రభుత్వ సంస్థ విడుదల చేసిన రకాలను సాగు చేసే పరిస్థితి కనిపించడం లేదనేది రైతుల వాదన.

ప్రైవేట్ వరి రకాలతో నష్టం



గతంలో వానాకాలంలో బీపీటీ, యాసంగిలో ఎంటీ యూ-1010 రకాలను సాగుచేశా. మంచి దిగుబడులు వచ్చేవి. ఐదేళ్ల నుంచి ఆ రకం ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. ప్రైవేట్ రకాలకు మార్కెట్లో డిమాండ్ ఉండటంతో వాటినే సాగు చేస్తున్నా, తెగుళ్లు వ్యాప్తి అధికంగా ఉంది. దిగుబడులు ఎకరానికి 20-30 బస్తాలు మించి రావడం లేదు. గింజ మరీ సన్నగా ఉండటంతో బరువు తూగడం లేదు. యాసంగిలో అయితే తాలు అధికంగా వస్తోంది. ఒక్కోసారి పెట్టుబడులు రాక నష్టపోతున్నాం.

- ఉగ్గిడి ఆంజనేయులు, రైతు, త్రిపురారం

ఈ రకాలతో నష్టమే

మార్కెట్‌ను అనుసరించి ఆయకట్టులో పంటల సాగు సరళిలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇదే అదునుగా ప్రైవేట్ విత్తన కంపెనీలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. విత్తనాలకు డిమాండ్ బాగా ఉండటంతో ధరలు భారీగా పెంచారు. కేవలం 10కిలోల విత్తన ధర రూ.1,000 నుంచి రూ.1,100 వరకు విక్రయిస్తున్నారు. ఎకరం వరి నాటుకు 15 నుంచి 20కిలోల వరకు విత్తనం అవసరం కాగా, రూ.1,500 నుంచి రూ.2,000 వరకు ఖర్చు వస్తోంది. వరి నారు పోసిన మొదలు నాటు వరకు అగ్గి తెగులుతో పాటు మొగిపురుగు, ఆకుచుట్టు పురుగు, కాండం కుళ్లు, పాము పొడ, మెడ విరుపు, వరి కర్ర సన్నగా ఉండటంతో దోమ వ్యాప్తి అధికంగా ఉంటోంది. రసాయనిక ఎరువులతో పాటు పురుగు మందులు అధికంగా పిచికారీ చేయడం వల్ల పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. సంప్రదాయ వరి రకాల సాగుకు ఎకరానికి రూ.20,000 నుంచి రూ.25,000 వరకు పెట్టుబడులు అవుతుండగా, ప్రైవేట్ రకాలకు రూ.30,000 నుంచి రూ.40,000 వరకు ఖర్చు వస్తోంది. అయినా తెగుళ్ల నియంత్రణలోకి రాకపోవడంతో ఎకరానికి 20-30 బస్తాల దిగుబడి రావడం కష్టంగా మారింది. దీంతో కనీసం పెట్టిన పెట్టుబడులు రాక రైతులు భారీగా నష్టపోతున్నారు. మిల్లర్లకు కాసులు కురిపిస్తున్న ప్రైవేట్ వరి వంగడాలు రైతులను అగాధంలోకి నెడుతున్నాయి. ఈ విత్తనాలు వాతావరణ మార్పులకు తట్టుకోలేకపోవడంతో పాటు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటమే కారణమని వ్యవసాయశాఖ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తాం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ, ఆగస్టు 17 : అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపచేస్తామని మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కోదాడ పట్టణంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సోల్జర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మావతిరెడ్డి, తాను చేసేదే చెప్తామని, చెప్పిందే చేస్తామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి చూపించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. రూ.2లక్షల వరకు రైతుల పక్షాన ప్రభుత్వమే బ్యాంకులకు రుణం చెల్లిస్తుందన్నారు. రూ.2లక్షలపైన ఏమైనా సందేహాలు ఉంటే, అధికారులను కలిసి వివరించాలన్నారు. అదేవిధం గా అర్హత ఉండి, రుణమాఫీ కాని వారు వ్యవసాయాధికారులను కలవాలని సూచించారు. అదేవిధంగా సోషల్‌మీడి యా సోల్జర్స్ ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రధాని నరేంద్రమోదీ గత ఎన్నికలో విజయం సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా రానున్న ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రధాని లక్ష్యంగా సోల్జర్స్ పనిచేయాలన్నారు. కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ప్రతీ వార్డుకు ఒక సోషల్ మీడియా సోల్జర్‌ను నియమించుకొని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ ఎవరికైనా రుణమాఫీ కాకపోతే క్లస్టర్స్‌లో ఏఈఓలు, మండలంలో ఏఓలు అందుబాటులో ఉంటారని, ఆధార్‌కార్డు నెంబర్ పంపితే రుణం వివరాలను తెలియపరుస్తారని, రైతులకు తెలిపారు. రుణమాఫీ కాని వారు ఉంటే తప్పులు సరిచేసుకొని రుణమాఫీ లబ్ధిపొందాలన్నారు. రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని, అర్హత ఉన్న వారు రుణమాఫీ కాకపోతే అధికారులకు వివరాలను అందిస్తే ఇంటికి వచ్చి వివరాలను సేకరించి, రుణమాఫీ అందేటట్లు చూస్తారని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అధికారులు, ప్రజాప్రతినిధులు, సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

లక్ష్య సాధన కోసం కష్టపడాలి: ఎస్పీ



జిల్లా పోలీస్ కార్యాలయంలో మొక్క నాటుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేట క్రైం, ఆగస్టు 17 : జీవితంలో ఉన్నత స్థానాలకు చేరేందుకు ముందుగానే లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం కష్టపడాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. శనివారం బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యలో రాణిస్తేనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. తల్లిదండ్రుల కలలను సాకాం చేయడంతో పాటు విద్యనేర్పిన గురువులకు పేరు,ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. బాలికల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మహిళలు, బాలికల రక్షణ విషయంలో పోలీస్‌శాఖ నిరంతరం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఏసమయంలో ఆపద ఎదురైనా వెంటనే డయల్-100కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం విద్యార్థినులు ఎస్పీతో పాటు పోలీస్ అధికారులు, సిబ్బందికి రాఖీలు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, ఎస్‌బీఐ వీరరాఘవులు, ఆర్ఐ నారాయణరాజు, ఇతర అధికారులు కిరణ్మయి, చైతన్య, రేవతి, వినోద్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

సీఈవో సుదర్శన్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఈవో సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 17 : జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి అదనపు సీఈవో లోకేష్‌కుమార్‌తో కలిసి కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18ఏళ్ల నిండిన వారికి ఓటరు జాబితాలో ఓటు హక్కు కల్పించాలన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి అక్టోబరు 28 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. అక్టోబరు 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయాలని, నవంబరు 28 వరకు సదరు ఓటరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి డిసెంబరు 24లోపు అభ్యంతరాలను పరిష్కరించి వచ్చే ఏడాది జనవరి 6న తుది ఓటరు జాబితాను రూపొందించాలని సూచించారు. ఓటరు జాబితాలో తప్పులను సరిచేయాలని ఆదేశించారు. 1,500 ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేయాలని అవసరమైన చోట నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఓటరు జాబితాలో ఉన్న డబుల్ ఎంట్రీలను తొలగించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 79,822 ఫారం-8 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. నూతనంగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారి వయస్సును జాగ్రత్తగా పరిశీలిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీవోలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాసులు, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, మెడికల్ కళాశాల విద్యార్థులు

సూర్యాపేటటౌన్, ఆగస్టు 17: ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ కరువైందని, ప్రభుత్వాలు వైద్యుల రక్షణకు ప్రత్యేకచట్టాలు తీసుకురావాలని ప్రముఖ వైద్యుడు వూర రామూర్తి యాదవ్,ఐఎంఏ అధ్యక్షుడు ఆనంద్ డాంగ్గే, రమేష్ అన్నారు. కోల్‌కతాలో వైద్యవిద్యార్థి హత్యాచార ఘటనను నిరసిస్తూ శనివారం జిల్లా కేంద్రంలో ఐఎంఏ, మెడికల్ కళాశాల విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించి, మాట్లాడారు. దేశంలో వైద్యులపై నిత్యం దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్జీకర్ ఆసుపత్రిలో వైద్యవిద్యార్థినిపై దాడిని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. దాడికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆర్జీకర్ ఘటన కేవలం మహిళా డాక్టర్‌పై జరిగిన దాడి కాదని మహిళలపై జరిగిన దాడి అని తెలిపారు.కార్యక్రమంలో వైద్యులు,మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మఠంపల్లి ఆలయంలోకి వరద నీరు

- కరకట్ట నుంచి లీకేజీ
- అర అడుగు మేర ప్రాంగణంలో నిల్వ
- రెండు మోటార్ల ద్వారా తొలగింపు



మట్టపల్లి ఆలయం వద్ద కృష్ణనది ప్రవాహం

మఠంపల్లి, ఆగస్టు 17 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని ప్రసిద్ధ మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి మరోమారు ముంపు పొంచి ఉందా అన్న అనుమానాలు మొదలయ్యాయి. పులిచింతల ప్రాజెక్టుకు నీటి వరద పెరుగుతుండటంతో మట్టపల్లి ఆలయం చుట్టూ ఉన్న కరకట్ట నుంచి నీరు ఆలయ ప్రాంగణంలోకి లీకవుతోంది. రెండళ్ల కిందట కృష్ణానదికి వరదలు రావడంతో వారం రోజులకు పైగా నిత్యార్చనలు నిలిచిపోగా, ఆలయంలో నీటిని రోజువారీగా మోటార్ల సాయంతో ఎత్తిపోయాల్సి వచ్చింది. ప్రస్తుతం కూడా ఎగువ నుంచి వరద ఉధృతి ఉండటంతో పులిచింతల ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175(45.77 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 174.34(44.74 టీఎంసీలుగా) అడుగులుగా నమోదైంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 58,450 క్యూసెక్కులు వస్తోంది. దీంతో ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ మట్టపల్లి ఆలయ సమీపంలోని మెట్లమార్గం మొత్తంతో పాటు కరకట్టకు సుమారు ఏడు అడుగుల మేర నీరు చేరి లీకేజీ అవుతోంది. దీంతో ఆలయ ప్రాంగణంలో అడుగు మేర వరద నీరు చేరడంతో ఆ నీటిని ఆలయ నిర్వాహకులు రెండు మోటార్ల ద్వారా బయటకు పంపిస్తున్నారు.వరద ప్రవాహం పెరిగితే ఆలయం రెండేళ్ల కిందటి పరిస్థితిని ఎదుర్కొవాల్సి వస్తుందని స్థానికులు అంటున్నారు.

చుట్టూ కరకట్ట ఉన్నా?


కృష్ణనదీ తీర ప్రాంతాల్లోని పంచానారసింహ ఆలయాల్లో ఒకటైన మట్టపల్లి క్షేత్రానికి ఎంతో ప్రత్యేక ఉంది. తెలుగు రాష్ట్రాల వారధి, సిమెంట్స్ పరిశ్రమలు, నాపరాయి, రంగురాళ్లకు కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతం పులిచింతల ప్రాజెక్టు నిర్మాణ అనంతరం వరద ముంపుకు గురవుతోంది. ఆలయాన్ని వరద నుంచి రక్షించేందుకు రూ.3 కోట్లతో కృష్ణానది పరివాహకం నుంచి ఆలయం చుట్టూ కరకట్ట నిర్మించారు. అయినప్పటికీ వరద ఉధృతి పెరిగిన సమయంలో కరకట్ట నుంచి నీరు ఆలయ ప్రాంగణంలోకి లీకవుతోంది. దీంతో ఆలయంలో నీరు నిల్వ చేరి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఎగువ నుంచి పరవళ్లు తొక్కుతూ వెళ్తున్న కృష్ణమ్మను చూసి సంబరాపడాలో ఆలయం ముంపునకు గురవుతుందని ఆందోళన చెందాలో అర్థం కాని పరిస్థితుల్లో స్థానికులు ఉన్నారు.



మోటర్ల ద్వారా బయటకు పంపిస్తున్న లీకేజీ నీరు

అర్హులందరికీ రుణమాఫీ కోసం స్పెషల్ డ్రైవ్

- ఉమ్మడి జిల్లాకు మరో ఐదు కొత్త బ్రాంచ్‌లు
- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



రైతులకు రుణమాఫీ చెక్కులు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 17: అర్హులైన రైతులందరికీ రుణమా ఫీ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో రుణమాఫీపై సొసైటీ చైర్మన్లు, సీఈవోలు, ఇతర అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిం చి పలువురు రైతులకు రుణమాఫీ చెక్కులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆగస్టు 15లోగా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసిందని, సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల కోసం స్పెష ల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 36 బ్రాంచ్‌ల పరిధిలో మొత్తం 89,888 మందికి సంబంధించిన రుణమాఫీకి రూ.499.98కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు రుణమాఫీగా రూ.279.76కోట్లు రైతు ల ఖాతాల్లో జమయ్యాయన్నారు. మిగతా రుణమాఫీ సొమ్ము సాంకేతిక కారణాలతో నిలిచినందున వారం రోజు ల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అందరి రుణాలు జమచేస్తామన్నారు. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాల నెంబర్లు తప్పుగా ఉండటంతో రుణమాఫీ నిలిచిందన్నారు. ప్రతీ రైతుకు న్యా యం చేసేందుకు తమ పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. స్పెషల్ డ్రైవ్ సందర్భంగా రైతులు అధికారులను కలిసి వారి ఖాతా నెంబర్లు, ఆధార్ కార్డులను సరిచూసుకొని రుణమాఫీ పొందాలన్నారు. ప్రతీ సహకార బ్యాంకులో అధికారులు, ప్రజా ప్రతినిధులు రుణమాఫీ కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు కొత్త మరో ఐదు బ్రాంచ్‌లు వచ్చాయని, మరో ఆరు బ్రాంచ్‌లకు ప్రతిపాదనలు పంపామన్నారు. కొత్తగా తిప్పర్తి, ఆత్మకూర్(ఎం), సంస్థాన్‌నారాయణపురం, గరిడేపల్లి, దామరచర్ల బ్రాంచ్‌లు ఏర్పాటవుతాయన్నారు. కొత్తగా టెస్కాబ్ నుంచి రూ.90కోట్ల రుణాలు మంజూరయ్యాయని తెలిపారు.

ఎల్‌టీ లోన్‌లకు పరిమితి అనేది లేకుండా రుణాలు ఇస్తామన్నారు. విదేశీ విద్య కోసం ఎకరానికి రూ.5లక్షల చొప్పున రూ.35లక్షల రుణాన్ని అందిస్తామన్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకును తీర్చిదిద్దడమే గాక, రూ.3వేల కోట్ల టర్నోవర్‌కు తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

నూతన్‌కల్, ఆగస్టు 17 : జిల్లాలో ప్రతీ గ్రామంలో పంచాయతీ స్పెషల్ అధికారులు పారిశుధ్య చర్యలతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని డీఎల్‌పీవో నారాయణరెడ్డి కోరారు. శనివారం మండలంలోని ఎర్రపహాడ్ గ్రామ పంచాయతీని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు సర్పంచ్‌లు లేక కొన్నిపనుల్లో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనన్నారు. ప్రజలు అధికారులకు సహకరించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. మిషన్ భగీరథ మంచినీటిని గ్రామాలకు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సత్యవతి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అక్రమంగా మద్యం నిల్వ చేస్తే

కఠిన చర్యలు తప్పవు

సూర్యాపేట రూరల్, ఆగస్టు 17 : అక్రమంగా మద్యం నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు.శనివారం సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎన్నికల కోడ్ సమయంలో వివిధ కేసుల ద్వారా పట్టుబడిన మద్యాన్ని పోలీస్, ఎక్సైజ్ శాఖల సమక్షంలో పంచనామా నిర్వహించి, ధ్వంసం చేశారు. అదేవిధంగా 2019, 2020 సంవత్సరాల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యాన్ని కూడా ధ్వంసం చేశారు.కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐమల్లేష్, రూరల్‌ఎస్ఐ బాలునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 17: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో శనివారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. సుప్రభాతసేవలో మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభులను సువర్ణ ప్రతిమూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలను అభిషేకించి తులసి దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్యకల్యాణోత్సవం ఆగమశాస్త్రీతిలో అత్యంత వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారులను ముగ్ధమనోరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రీతిలో నిర్వహించారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. కాగా ధార్మిక సాహిత్య సంగీత సభల్లో భాగంగా పరవీణ మ్యూజిక్ అకాడమి శ్రీమతి శాంతి చంద్రిక బృందం వారితో భక్తి సంగీతం, హైదరాబాద్ జేఎస్ డ్యాన్స్ అకాడమీ శ్రీఖర్ మాస్టర్ బృందం కూచిపూడి నృత్యం కార్యక్రమాలను నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐఏఎస్ ఆర్.ముత్యాలరాజు కుటుంబ సమేతంగా, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్ స్వామి వారిని వేర్వేరుగా దర్శించుకున్నారు.



సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మూసీలో గుర్తు తెలియని మృతదేహం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కేతేపల్లి, ఆగస్టు 17: మూసీ నదిలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. నల్లగొండ జిల్లా కే తేపల్లి మండలం ఉప్పలపహాడ్ గ్రామ శివారులోని మూసీనదిలో 60 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి ఆచూకీ కోసం పరిసర మండలాలు, గ్రామాలకు చెందిన వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారాన్ని వైరల్ చేసినా మృతుడి వివరాలు లభించలేదని ఎస్ఐ శివతేజ తెలిపారు. మృతుడి ఒంటిపై గ్రే కలర్ టీ షర్టు, నీలం రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని, ఆనవాళ్లు తెలిసిన వారు 872670180కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. మృతదేహాన్ని నకిరేకల్ ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపచినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కేతేపల్లి, ఆగస్టు 17: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఇనుపాముల‌లో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ శివతేజ తెలిపిన మేరకు సంఘటన వి వరాలిలా ఉన్నాయి. నకిరేకల్ మండలం మండలాపురం గ్రామానికి చెందిన తీగల దిలీప్ (22) జాతీయ రహదారిపై కాలినడకన సూర్యాపేట వైపునకు వెళ్తుండగా ఇనుపాముల గ్రామ శివారులోని వెనక నుంచి గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దిలీప్ అక్కడికక్కడే మృతి చెం దాడు. దిలీప్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నకిరేకల్ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. దిలీప్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

సాగర్ రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల


నాగార్జునసాగర్ రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్,ఆగస్టు 17: నాగార్జునసాగర్ ప్రాజెక్టు రెండు క్రస్ట్‌గేట్లను ఏడు అడుగుల మేరకు ఎ త్తి 22,400క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చే స్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590(312.0450టీఎంసీలు)అడుగులు కాగా ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీరు నిల్వ ఉంది. ఎగువన శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు(215.8070టీఎంసీలు) కాగా ఆ ప్రాజెక్టుకు ఎగువ నుంచి 92,234 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో ప్రస్తుతం 881.20 అడుగులుగా(194.7599టీఎంసీలుగా) నీరు నిల్వ ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాలల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 68,984 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో సాగర్ నీటి మట్టం ప్రస్తుతం 590 అడుగులుగా ఉంది. సాగ ర్ నుంచి కుడి కాల్వ ద్వారా 8,375 క్యూసెక్కులు, ఎడ మ కాల్వకు 7518 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,191 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, రెండు క్రస్ట్‌గేట్లను ద్వారా 22,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 69,884 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 68,984 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.

పులిచింతల రెండు గేట్ల ద్వారా నీటి విడుదల

మేళ్లచెర్వు: ఉభయ రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు రెండు రేడియల్ క్రస్ట్‌గేట్లను 2.5 మీటర్లు ఎత్తు 41,698 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175(45.77టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 174.34(44.74 టీఎంసీలుగా) అడుగులుగా నమోదైంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 58,450 క్యూసెక్కులు వస్తుండగా, తెలంగాణ జెన్‌కో విద్యుత్ కేంద్రం నుంచి 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 104 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. కాగా ప్రాజెక్టు ఔట్‌ఫ్లో 57,698 క్యూసెక్కులుగా నమోదైంది.

మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో

కేతేపల్లి : నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్ జంటనగరాలతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల తో కొద్దిరోజులుగా వరద నీరు దిగువన మూసీ ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో శుక్రవారం సా యంత్రానికి 662.03క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో శనివారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగి 768.05 క్యూ సెక్కులుగా నమోదైంది. 645(4.46టీఎంసీల)అడుగు ల నీటిమట్టం కలిగిన ప్రాజెక్టులో ప్రస్తుతం 642.38 (3.78టీఎంసీల) అడుగులుగా నీటిమట్టం ఉంది. మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం కుడికాల్వకు 305.95క్యూసెక్కులు, ఎడమ కా ల్వకు 258.88క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

▸▸ దొంగను పట్టుకున్న స్థానికులు ▸▸ విచారిస్తున్న పోలీసులు

సూర్యాపేట క్రైం, ఆగస్టు 17 : మహిళ మెడలోంచి బంగారు గొలుసును లాక్కెళ్లిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. బాధితురాలు చంద్రకళ, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేటలోని 60 అడుగుల రోడ్డు వద్ద అదే ప్రాంతానికి చెందిన చంద్రకళ అనే మహిళ పనినిమిత్తం నడుచుకుంటూ వెళ్తోంది. ఆ సమయంలో ఓ యువకుడు ఆమె మెడలోని సుమారు రెండు తులాలకు పైగా ఉన్న బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. అప్రమత్తమైన మహిళ దొంగ, దొంగ అని కేకలు వేసింది. గమనించి స్పందించిన స్థానికులు కొందరు పారిపోతున్న దొంగను పట్టుకున్నారు. అదేవిధంగా అతడి వద్ద నుంచి అపహరించిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. గొలుసును గట్టిగా లాగడంతో మహిళ చెవికి స్వల్ప గాయమైంది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీసీఎస్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దొంగను స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. చోరీకి పాల్పడిన యువకుడిది ఖమ్మం జిల్లా కేంద్రం కాగా అతడు ప్రేమ వివాహం చేసుకుని ఆర్థికఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాక బీఈడీ విద్యనభ్యసించి ప్రభుత్వ ఉద్యోగం రాక ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. పోలీసులు మాత్రం తమదైన శైలిలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

గొర్రెల దొంగల పట్టివేత

చిట్యాల: గొర్రెల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని శనివారం అరెస్ట్ చేసినట్లు నల్లగొండ జిల్లా చిట్యాల ఎస్ఐ ధర్మా తెలిపారు. శనివారం ఎస్ఐ మాట్లాడుతూ ఈ నెల 16న మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో ఎనిమిది మంది వ్యక్తులు ఒక ట్రాలీ ఆటో, రెండు కార్లు, ఒక బైక్‌పై తిరుగుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లారు. పోలీసులను చూసి అనుమానితులు పారిపోతుండగా వారిలో ఇద్దరిని పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. విచారణలో ఒకరు కేతేపల్లి మండలం బొప్పారం గ్రామానికి చెందిన గౌరారపు వీరబాబు, మరొకరు త్రిపురారం మండలం అంజనపల్లి గ్రా మానికి చెందిన నీరకంటి రాజశేఖర్‌గా గుర్తించారు. వీరంతా ఏడు నెలలుగా ఒక ముఠాగా ఏర్పడి చిట్యాల, చౌటుప్పల్, భువనగిరి, ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో గొర్రెలను దొంగిలిస్తున్నట్లు తేలిందన్నారు. వీరి నుంచి ట్రాలీ ఆటో, రెండు కార్లు, బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రె పొట్టేలు మృతి

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 17: విద్యుదాఘాతంతో గొర్రె పొట్టేలు మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలకేంద్రంలోని దుగ్యాల ఆదర్శ పాఠశాల సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు, బాధితురాలు కట్టబోయిన పార్వతమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోజువారీ లాగే పార్వతమ్మ తన గొర్రెలను మేపేందుకు తీసుకెళ్తుండగా స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద నీరు ఉండడంతో ఆ గొర్రె లు నీళ్లు తాగడానికి వెళ్లాయి. అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్ తగిలి గొర్రె పొట్టేలు అక్కడికక్కడే మృతి చెందింది. పొట్టేలు రూ.30వేల విలు వ ఉంటుందని బాధితురాలి తెలిపింది. విద్యుత్ అధికారుల ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ వేయకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఆదర్శ పాఠశాల ఉంటుందని, ఒక వేళ విద్యార్థులు ఆడుకోవడానికి వెళితే పెనుప్రమాదం సంభవిస్తుందని, అధికారులు వెంటనే ఫెన్సింగ్ వేయాలని స్థానికులు కోరుతున్నారు.

రేషన్ దుకాణాల్లో దాడులు

చింతపల్లి, ఆగస్టు 17: దేవరకొండ, పెద్దవూర డీటీఎస్ అధికారులు శ్రీనివాస్ ముక్తార్ ఆధ్వర్యంలో చింతపల్లి మండలంలో పలు రేషన్ దుకాణాల్లో శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని వర్కాల, ఘడియాగౌరారం, నసర్లపల్లిలోని రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. ప్రతీ నెలా రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు అందించాలని సూచించారు. సమయపాలన పాటించి ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా అర్హులకు పారదర్శకంగా రేషన్ సరుకులు అందించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే పీడీ యాక్టు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఆర్ఐసీఎస్ సైదులు పాల్గొన్నారు.

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

డిండి: మండలంలోని కాల్వతండా వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... డిం డి మండలం కాల్వతండా నుంచి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. కాల్వ తండా వద్ద ఆరు క్వింటాళ్లను బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఎండి.రియాజ్, మంజురుస్సేన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి ఘటనలో చిన్నారి మృతి బాధాకరం


పావని తల్లిదండ్రులను పరామర్శిస్తున్న మాజీమంత్రి జగదీష్‌రెడ్డి

● మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

నాగారం, ఆగస్టు 17: తల్లిదండ్రులపై జరుగుతున్న దాడిని అడ్డుకోబోయి తోపులాటలో కిందపడి చిన్నారి కాసం పావని మృతిచెందడం బాధాకరమని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని డి.కొత్తపల్లి గ్రామంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, గాదరి కిషోర్‌కుమార్, రమావత్ రవీంద్రకుమార్‌లతో కలిసి పావని తల్లిదండ్రులను శనివారం పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ల క్రితం జరిగిన చిన్న గొడవను మనస్సులో ఉంచుకొని ప్రత్యర్థులు రాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడి కాసం సోమయ్య, అతని భార్య మంజులను గాయపరిచారన్నారు. తల్లిదండ్రులపై దాడి చేస్తున్నారని గమనించి అడ్డుపడిన సోమయ్య-మంజుల దంపతుల చిన్న కూతురు పావని మృతికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పావని కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతలు లేకుండాపోయాయన్నారు. పావని చిత్రపటానికి పూలమాలవు వేసి నివాళులర్పించారు.

నిందితుల అరెస్టు

ఈ నెల 15 తేదీన కాసం సోమయ్య, అతడి భార్య మంజులపై దాడి చేసి వారి కుమార్తె పావని మృతికి కారకులైన కడారి సైదులు, కడారి సోమయ్య, కాసం కళింగంపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్ఐ ఐలయ్య తెలిపారు. అరెస్టు చేసిన వారిని తుంగతుర్తి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచామని, జడ్జి ఆదేశం మేరకు నిందితులను సూర్యాపేట జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు. పావని అంత్యక్రియలు శుక్రవారం రాత్రి ఏడు గంటలకు పూర్తయ్యాయి. అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతరు కళ్లముందే చనిపోవడంతో గుండెలవిసేలా విలపించారు. గ్రామంలో ఆవాంచనీయ సంఘటనలు జరగకూండా నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుక్కల దాడిలో బాలికకు తీవ్ర గాయాలు

ఆత్మకూర్(ఎస్)ఆగస్టు 17: బజారుకు వెళ్లిన బాలికపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం బొప్పారం గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొప్పారం గ్రామానికి చెందిన చెక్కల వీరభద్రం కుమార్తె మేఘన శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. వీధిలో ఉన్న నాలుగుకుక్కలు బాలికపై దాడి చేశాయి. బాలిక అరుపులకు చుట్టుపక్కల వారు వచ్చి కుక్కలను అక్కడి నుంచి తరిమే శారు. అప్పటికే బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో బాలికను తండ్రి వీరభద్రం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స చేయించారు. ఐదు నెలల నుంచి కుక్కలు గ్రామంలో ఆరుగురిపై దాడి చేసి గాయపర్చాయని గ్రామస్థులు తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ప్రాజెక్టులతోనే ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

● నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి

మర్రిగూడ, ఆగస్టు 17: నల్లగొండ జిల్లా ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారం డిండి, శివన్నగూడ ప్రాజెక్టులతోనే సాధ్యమవుతుందని నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా మిషన్ భగీరథ ద్వారా కృష్ణానది జలాలను తాగిన తర్వాత ఈ ప్రాంత ప్రజల ఆరోగ్య స్థితిగతులను ఫ్లోరోసిస్ సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు దంత ఫ్లోరోసిస్ వచ్చిందేమోనని దంతాలను పరిశీలించారు. డిండి ఎత్తిపోతల ద్వారా స్వర్ణగూడెంలో నిర్మిస్తున్న ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి కన్వీనర్ కంచుకట్ల సుభాష్ వివరించారు. ప్రాజెక్టు పనులు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపాదికన నిర్వహిస్తే ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, నాయకులు మహేశ్వరం సతీష్, గొట్టిముక్కుల ప్రకాష్, మాస బాలరాజు, శ్రీనివాస్, కృష్ణమూర్తి, వెంకటంపేట బాలయ్య, వెలమినేటి సత్తిరెడ్డి, సురిగి యాదయ్య, వంగూరి సంజీవయ్య, పురుషోత్తం వెంకటేశ్వర్లు, లింగయ్య, శ్రీనివాస్, హరికృష్ణ కోమల్ సునీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల దంతాలను పరిశీలిస్తున్న రాజారెడ్డి

దాడుల నుంచి వైద్యులకు రక్షణ కల్పించాలి



కోదాడలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు


హుజూర్‌నగర్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది


సూర్యాపేట పట్టణంలో మానవహారం నిర్వహిస్తున్న మహిళలు

కోదాడ, ఆగస్టు 17: దాడుల నుంచి వైద్యులకు రక్షణ కల్పించాలని ఐఎంఏ అధ్యక్షుడు మద్దినేని లక్ష్మీప్రసాద్ అన్నారు. కలకత్తాలో మహిళా డాక్టర్‌పై జరిగిన దాడికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపుమేరకు వైద్యులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా వైద్యురాలిపై దాడి నిరసిస్తూ శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, అశోక్‌కుమార్, జాస్తి సుబ్బారావు, బీవీఎస్ ప్రసాద్, కొత్తమాసు జనార్దన్, దశరథ్‌నాయక్, శ్రీనివాసరెడ్డి, ఎల్. భాస్కర్‌రావు, చంద్రమోహన్, ప్రమీల, సిద్దార్థ, రోహిత్, రాజేష్‌రెడ్డి, అభిరామ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటటౌన్: దేశంలో మహిళలకు రక్షణ కరువైందని 45వార్డు కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్, డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా జిల్లాకేంద్రంలోని 45వ వార్డులో ర్యాలీ నిర్వహించారు. నిత్యం సమాజంలో మహిళపై హత్యా చారాలు, భౌతికదాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కత్తాలో మహిళా డాక్టర్‌పై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ఇరిగి కోటేశ్వరీ, మద్ది హైమావతి, బిక్కుమళ్ల మంజుల, మిర్యాల కవిత, ఉప్పల మంజుల, రుచిత, మౌనిక, రేణుక, నల్లపాటి సునీత, అనంతుల ఇందిర, మిట్టపల్లి శైలజ, ఆర్‌పీవిజయ, మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: కోల్‌కత వైద్యురాలిపై హత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన నిరసనగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఎదుట వైద్యులు నిరసన తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మహిళా డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. డాక్టర్ల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలన్నారు. అదే విధంగా పట్టణంలోని ఈఎస్‌ఐ ఆస్పత్రుల ఎదుట డాక్టర్లు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వనజ, వెంకట్రాది, రవికుమార్, నాగేంద్రరావు, శివశంకర్, కరుణ, స్రవంతి, ఆస్రవీ, శ్యామ్‌కుమార్, శాంతకుమారి, మౌనిక, సీతాదేవి, జ్యోతి, భూపాల్, సునిత పాల్గొన్నారు. డాక్టర్‌ను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని హుజూర్‌నగర్ డివిజన్ ఐఎంఏ సభ్యులు డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ సుధశ్రీపతి కోరారు. డాక్టర్లకు భద్రత చట్టం కల్పించాలన్నారు. సమావేశంలో డాక్టర్ వనజ, ప్రవీణ్, మనోహర్, కిరణ్‌కుమార్, కార్తీక్, విష్ణువర్దన్, రాకేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటరూరల్: వైద్య సిబ్బందిపై జరుగుతున్న దాడులను అరికట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని చందన నర్సింగ్ కళాశాల డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. కళాశాలలో నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యుల పరిరక్షణకు ప్రత్యేక చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలన అధికారి గుండా రమేష్, ప్రిన్సిపాల్ శ్రవణ్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి. పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠమహోత్సవాలు ప్రారంభం


అయ్యప్ప దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నేరేడుచర్ల, ఆగస్టు 17: అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మాల స్వీకరించిన భక్తులు, ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో మామిడి తోరణాలు కట్టి ఆలయం కార్యక్రమాలు ప్రారంభించారు. వేద పండితులు ఇరువంటి వేంకటరమణశర్మ, సత్యనారాయణశర్మ, జొన్నపట్ల కిషోర్‌శర్మల ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాసన గోపూజ, రక్షాబంధన్, దీక్ష దారరణ, షోడశస్తంభ పూజలు, సర్వతోభద్ర మండప, నవగ్రహ, చతుషష్టిస్తయోగిని, వాస్తు, క్షేత్రపాలక మండప ఆవాహనాలు, మూలమంత్ర అనుష్ఠానములు, అగ్నిమదన, యాగశాల ప్రవేశం నిర్వహించారు. దేవతామూర్తుల విగ్రహాలను జలాధివాసం కోసం ధాన్యాది వాసం చేయించి దేవాలయం ప్రాంగణంకు తీసుకు వచ్చారు.

'పాఠశాలల్లో పనులు నాణ్యతగా ఉండాలి'

పెన్‌పహడ్, ఆగస్టు 17: ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనులు నాణ్యతగా ఉండాలని ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని దూపహడ్, గూడెపుకుంటతండా, జల్మాల్‌కుంటతండా, చిన్నసీతారాంతండా, పెద్ద సీతారాంతండా, మొరసకుంటతండా, నూర్జహాన్ గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో నిర్మిస్తున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. పనులు పూర్తికావడానికి వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

తుంగతుర్తి, ఆగస్టు 17: విద్యార్థులు కష్టపడి చదివి విద్యలో రాణించాలని విశ్రాంత ఉపాధ్యాయుడు ఓరుగంటి సత్యనారాయణ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు షూ, టై, బెల్ట్‌లతో పాటు ఆట పాటల్లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడి చదివి మంచి మార్కులు సాధించినప్పుడే ఉన్నతమైన ఉద్యోగాలు పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఉపాధ్యాయులు సూర్యప్రకాష్, బొంకూరి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

యాతవాకిళ్ళ చెరువు నుంచి నీటి విడుదల

మఠంపల్లి, ఆగస్టు 17: వేములూరి ప్రాజెక్టులో బాగమైన యాతవాకిళ్ళ చెరువు నుంచి నీటి పారుదల శాఖ అధికారులు ఎడమ, కుడి కాల్వలకు శనివారం నీరు విడుదల చేశారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సాగర్ నీటితో చెరువు నింపుతునందున ఆయకట్టు రైతులకు చెరువు ద్వారా నీటిని విడుదల చేసి పంట, పొలాలకు వినియోగించుకునే విధం గా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.


నీరు విడుదల చేస్తున్న అధికారులు

పీఆర్‌టీయూటీఎస్ మండల కమిటీ ఎన్నిక

సూర్యాపేటఅర్బన్, ఆగస్టు 17: పీఆర్‌టీయూటీఎస్ సూర్యాపేట మండల కమిటీని ఆ సంఘం కార్యాలయంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లెం శంకర్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పటేల్ శ్రీమాన్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎంఏ. ఖదీర్, కార్యదర్శిగా శంకర్‌నాయక్, మహిళా ఉపాధ్యక్షురాలిగా రెబ్బ శ్రీలత, మహిళా కార్యదర్శిగా రేణుక ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతుల చంద్రశేఖర్, చింతరెడ్డి రామలింగారెడ్డి, తంగెళ్ళ జితేందర్‌రెడ్డి, దొంగర మహేష్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, దయాకర్, వీరారెడ్డి, రాజయ్య, మోహన్‌రెడ్డి, శంకర్, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, గురు ప్రసాద్, పవన్‌కుమార్, రవి, ప్రసాద్, భవాని, శోభారాణి, సబిత, జ్యోతి పాల్గొన్నారు.


శంకర్, శ్రీమాన్‌రెడ్డి

చిలుకూరులో ఇంటింటి జ్వర సర్వే

చిలుకూరు, ఆగస్టు 17: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి జ్వర సర్వే నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దోమల మందు పిచికారీ చేశారు. మండలంలోని జానకినగర్‌లో విషజ్వరాలు పెరగడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. గ్రామస్థుల రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో దోమల మందు పిచికారీ చేసి, పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డీవో గిరి బాబు, డాక్టర్ ప్రియాంక, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషన్ మహేష్, పంచాయతీ కార్యదర్శి షరీఫుద్దీన్, బిల్ కలెక్టర్ ధర్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చట్టాలు సమర్థంగా అమలు చేయాలి

హుజూర్‌నగర్, ఆగస్టు 17: మహిళా చట్టాలు సమర్థవంతంగా అమలు చేయాలని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, కార్యదర్శి దేవరం మల్లేశ్వరి డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్ పట్టణంలో శనివారం జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. మోదీ పాలనలో దేశంలో మహిళలపై హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. కలకత్తాలో మహిళా డాక్టర్‌ను హత్య చేసిన నిందింతులను కఠినంగా శిక్షించాలన్నారు. మహిళలకు భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశ్య పిచ్చమ్మ, దేవరం సుజాత, లక్ష్మీ, వెంకటమ్మ, పద్మ, రాములమ్మ, సీతా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సృజన

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : పటేల్

సూర్యాపేటరూరల్, ఆగస్టు 17: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు చేపడుతోందని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దాస్‌తండా గ్రామంలో శనివారం గిరిజనుల ఏర్పాటు చేసిన తీజ్ పండగలో పాల్గొని గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల ప్రతీక తీజ్ పండగ అని సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. అనంతరం మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి తీజ్ బుట్టలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో నూనవత్ సేటు, బాలు, బిక్కుసింగ్, దాస్య, సోమ్లానాయక్, బాలు, పాండు, చాంప్ల తదితరులు పాల్గొన్నారు.


దాస్‌తండా గ్రామంలో తీజ్ పండుగలో పాల్గొన్న పటేల్ రమేష్‌రెడ్డి

పశుపోషణతో ఆర్థిక లబ్ధి పొందాలి

కోదాడ రూరల్, ఆగస్టు 17: పశుపోషణతో ఆర్థికంగా లబ్ధి పొందాలని కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి. పెంటయ్య అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, కోదాడ, అనంతగిరి మండలాల సంఘబంధాల నుంచి మహిళా శక్తి పథకంలో పాడిపశువుల పెంపకానికి ఎంపిక చేసిన 105మంది లబ్ధిదారులకు మండల పరిధిలోని చిమిర్యాల గ్రామంలో రైతు వేదికలో శనివారం శిక్షణ నిర్వహించారు. పాడి పశువుల పోషణపై సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధు, డీపీఎం గోవింద్, ఏపీఎంలు వీరబాబు, పబ్బతి లక్ష్మి, స్త్రీనిధి మేనేజర్ నాగమణి, సీసీలు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌లో..


హుజూర్‌నగర్‌లోని పాఠశాలలో రాఖీ వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు


సూర్యాపేటలో..

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి

సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకోవాలని ఉపాధ్యాయులు కోరారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ఓ పాఠశాలలో ముందస్తుగా రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. సంస్కృతి సంప్రదాయాలు తెలియచేసేలా విద్యార్థులతో రాఖీ వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. నేరేడుచర్లలోని అంజలీస్కూల్‌లో రాఖీ పండుగ నిర్వహించారు. పాఠశాలలో చిన్నారులకు రాఖీలు కట్టారు. సూర్యాపేట జిల్లా కేం ద్రంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌కు విద్యార్థులు రాఖీ కట్టారు.


నేరేడుచర్లలో రాఖీ కట్టుకుంటున్న చిన్నారులు



సూర్యాపేటలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌కు రాఖీ కడుతున్న విద్యార్థినులు

హుజూర్‌నగర్: పాస్టర్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల గోవర్ధన్, డేవిడ్‌రాజు, గుండు శ్యాముల్ కోరారు. శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గాజుల రామరాంలో సేవ చేస్తున్న పాస్టర్ ప్రసాద్‌పై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలని క్రైస్తవులకు భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో కరుణాకర్, సుధాకర్, కిరణ్, కృపానందం, దేవదానం, లింగా తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల: మండల వ్యవసాయ అధికారిగా డి. వెంకటేశ్వర్లు భాద్యతలు స్వీకరించారు. తిరుమలగిరి మండల వ్యవసాయ అధికారిగా పనిచేసిన వెంకటేశ్వర్లు బదిలీపై చివ్వెంలకు వచ్చారు. అదేవిధంగా కుడకుడ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిణిగా బి. శైలజ, దురాజ్‌పల్లి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిగా సహస్ బాధ్యతలు స్వీకరించారు.

నూతన్‌కల్ : మండలంలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన బిక్కి పుల్లయ్య మృతి సీపీఎంకు తీరని లోటని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. చిప్పకుంట్లలో జరిగిన పుల్లయ్య సంస్మరణ సభలో మాట్లాడారు. సమావేశంలో మల్లు నాగార్జున్‌రెడ్డి, కందాళ శంకర్‌రెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, సైదులు ఉన్నారు.

అనంతగిరి: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా నల్లా భూపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. పట్టణంలోని దుర్గాపురం సమీపంలో గల కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఎన్నుకున్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు భూపాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పెన్‌పహడ్: ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయాలని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్దార్థ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. సెప్టెంబరు 1 నుంచి అక్టోబరు 10వ తేదీ వరకు ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు నిర్వహించే పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బచ్చలకూరి జానయ్య, నాయకులు బీఎస్‌రాజు, గోపి, రాంబాబు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

తిరుమలగిరి రూరల్: మండలంలోని తాటిపాముల గ్రామానికి రెండు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిలకు కాంగ్రెస్ నాయ కులు ఎర్ర యాదగిరి, బోయిపెల్లి కిషన్ కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు లేక ఓవర్‌లోడ్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించారని తెలిపారు.

మద్దిరాల: ఉద్యోగులకు బదిలీలు సహజమని డీఎల్‌పీవో నారాయణరెడ్డి, తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఎంపీవో ఇబ్రహీం, ఏపీవో వెంకన్న పాల్గొన్నారు.

కోదాడ: సీఎం నుంచి ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్న డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డిని విశ్రాంత ఉద్యోగుల ఆ సంఘం భవనంలో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, సుదర్శన్‌రెడ్డి, రాంబాబు, నర్సయ్య, జగన్మోహన్ రావు, రంగారావు, బిక్షం, భ్రమరాంబ, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ: దోమల నివారణకు చర్యలు అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సాతులూరి హనుమంతరావు అన్నారు. విలేకరులతో మాట్లాడుతూ దోమలతో విషజ్వరాలు పెరుగుతున్నా మునిసిపల్ అధికారులు నిర్మూలించకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

కోదాడ రూరల్: రామలక్ష్మీపురం గ్రామంలోని వేణుగోపాల సీతారామచంద్రస్వామి దేవాలయంలో వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. పూజారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో వరలక్ష్మీవ్రతం, కుంకుమ పూజ నిర్వహించారు.

హుజూర్‌నగర్: పట్టణంలో సాయిబాబా దేవాలయం ఏరియాలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాంప్రసాద్ గౌడ్ తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించాలన్నారు.

మునగాల రూరల్: మండల వ్యవసాయాధికారిగా బుంగా రాజు బాధ్యతలు స్వీకిరంచారు. కోదాడ డివిజన్ సాంకేతిక వ్యవసాయ అధికారిగా పనిచేసిన రాజు సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. మునగాల క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారిగా మాచర్ల రమ్యతేజ బాధ్యతలు స్వీకరించారు. ఆకుపాముల క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారిగా మెడిశెట్టి ఉషశ్రీ బాధ్యతలు స్వీకరించారు.

మఠంపల్లి: వైద్య ఖర్చులు లేక ఇబ్బందులు పడుతున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ ఫండ్ అండగా నిలుస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాలోతు సక్రునాయక్ అన్నారు. మండలంలోని కాల్వపల్లితండాకు చెందిన లబ్ధిదారుడికి మంజూరైన సీఎం రిలీఫ్ చెక్కును అందజేశారు.

అల్లం ఉమారాణి మృతి బాధాకరం : ఉత్తమ్

హుజూర్‌నగర్, ఆగస్టు 17: కాంగ్రెస్ నేత ఉమ్మడి నల్లగొండ గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు అల్లం ప్రభాకర్‌రెడ్డి సతీమణి ఉమారాణి మృతి బాధకరమని మంత్రి ఉత్తమ్ అన్నారు. శనివారం పట్టణంలో ఉమారాణి సంతాప సభ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమారాణి అధ్యాపకురాలిగా ఎంతోమంది విద్యార్థులను ఉన్నతనంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ప్రభాకర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అల్లం ప్రభాకర్‌రెడ్డి, తన్నీరు మల్లికార్జున్ రావు, సాముల రాంరెడ్డి, గెల్లి రవి, సంపత్‌రెడ్డి, అజీజ్‌పాషా, సైదా, గొట్టె రామయ్య, గల్లా వెంకటేశ్వర్లు, ఈదృగంటి సుబ్బారావు, యర్రంశెట్టి పిచ్చయ్య, సాముల శివారెడ్డి, గూడెపు శ్రీను, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు: మండలంలోని బేతవోలు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి తల్లి వెంకటమ్మ ఇటీవల మృతిచెందారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల మృతిచెందిన పదో తరగతి విద్యార్థి హర్షవర్దన్ కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు.

కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలి

భానుపురి, చివ్వెంల, ఆగస్టు 17: కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట గ్రామీణ సీఐ సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని సుగుణ స్మార్ట్ సిటీలో కాలనీవాసులతో సమావేశం నిర్వహించారు. దొంగలు వస్తుండడం వల్ల కాలనీవాసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సూర్యాపేటలో దొంగలు తిరుగుతున్నారని సమాచారం తెలిస్తే పోలీసులకు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో చివ్వెంల ఎస్‌ఐ వెంకటరెడ్డి, సుగుణ స్మాట్ సిటీ కమిటీ అధ్యక్షుడు దామిడి రమేష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భిక్షం, సునీత, శివపార్వతి, మాధవి, చైతన్య, సురేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

సూర్యాపేటటౌన్, ఆగస్టు 17: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, పబ్లిక్‌క్లబ్ సెక్రెటరీ కొప్పుల వేణారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని వైట్‌హౌజ్‌లో చివ్వెంల మండలం మోదినిపురం గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కాంగ్రెస్ పాలన కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు దరావత్ వీరన్ననాయక్, సగరపు ప్రసాద్, చత్రునాయక్, వీరప్ప, వెంకన్న, జాను, సుధాకర్, రామలింగం, రాములు, శ్రీను, గిరి, అంజయ్య, వేణు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

సూర్యాపేటక్రైం, ఆగస్టు 17: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని మొదటి విడత ఇందిరమ్మకాలనీకి చెందిన వసీం అత్తర్‌ఖాన్(43) జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో అనారోగ్యానికి గురి కావడంతో అతనిని విధుల నుంచి తొలగించారు. చేసేది లేక భార్య ఫౌజియాబేగం ఆస్పత్రిలో స్వీపర్‌గా పని చేస్తుంది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారందరూ ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండి విద్యనభ్యసిస్తున్నారు. అత్తర్‌ఖాన్‌కు చికిత్స చేయించడంతో ఆరోగ్యం మెరుగైంది. ఇటీవల తిరిగి ఉద్యోగంలో చేరాడు. మళ్లీ మద్యం సేవించడం ప్రారంభించాడు. దీంతో మరోసారి ఆరోగ్యం క్షీణించింది. కుటుంబ పోషణకు అప్పులు తేవడంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ సమయంలో ఇంట్లో తల్లి ఉన్నా వృద్ధాప్యం కారణంగా కుమారుడిని ఆపలేకపోయింది. కుమారుడు ఉరేసుకునే విషయాన్ని చూసినప్పటికీ లేవలేని స్థితిలో ఉండడంతో గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల ఉన్నవారు వచ్చి అత్తర్‌ఖాన్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఫౌజియాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి బెదిరింపులు

పెన్‌పహడ్, ఆగస్టు 17: గ్రామ పంచాయతీ కార్యాలయానికి రావద్దని ఒక వ్య క్తి తనను బెదిరించాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహడ్ మండలం మా చారం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో తాను విధులు నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన కొరివి చౌడయ్య అనే వ్యక్తి గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి తన విధులకు ఆటంకం కల్పించి, దు ర్భాషలాడినట్లు వాపోయింది. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి వై.వెంకటలక్ష్మి ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యాలయంలోకి రా వద్దని బెదిరించాడని తెలిపింది. ఆ సమయంలో గ్రామ పంచాయతీ కార్యాలయం లో ఆశా వర్కర్ పద్మ, ఎంపీడబ్ల్యూ వర్కర్లు వెంకటయ్య, ముత్తమ్మ, శౌరయ్య ఉ న్నట్లు ఆమె ఎంపీడీవోకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

హుజూర్‌నగర్, ఆగస్టు 17: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. హుజూర్‌నగర్ పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. విద్యారంగాన్ని బలోపేతం చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టె శ్రీను, పెనుగొండ శ్రీను, మాతంగి ప్రభాకర్, శ్రీనునాయక్, వెంకటరెడ్డి, విజయ్, మీరావలి, బ్రహ్మారెడ్డి, రామలింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, దేవుడు, నరేష్, వెంకన్న, పాల్గొన్నారు. అనంతరం పీఆర్టీయూ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అంకతి శ్రీను, అసోసియేట్ అధ్యక్షులుగా నలబోలు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా సిరికొండ వెంకటయ్య, మహిళా ఉపాధ్యక్షురాలుగా వీరమ్మ, మహిళా కార్యదర్శిగా షర్మిళా కుమారిని ఎన్నుకున్నారు.


వేముల శ్రీను, అంకతి శ్రీను